# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు

9th HAPPY ANNIVERSARY

9 సంవత్సరాల ప్రయాణం

సంపుటి : 10 | సంచిక : 299 | పేజీలు : 4+8 | ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి | ఆదివారం 7 జూలై 2024

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda


## హైదరాబాద్ స్థిరాస్తులు ఇవ్వడానికి
# తెలంగాణ నో!
## ఢిల్లీలోని ఏపీ భవన్ తరహా నిర్మాణానికి ఒకే!!

**ముగిసిన రేవంత్, చంద్రబాబు భేటీ.. సమస్యల పరిష్కారానికి రెండు కమిటీలు వేయాలని నిర్ణయం**

- హైదరాబాద్‌లో భూమి కోసం అర్జీ పెట్టుకోవాలని ఏపీకి సూచించిన తెలంగాణ
- ఐదు గ్రామాలను ఇవ్వాలని కోరిన తెలంగాణ... ఏపీ సానుకూల స్పందన?
- విద్యుత్ బకాయిలపై ఇరు రాష్ట్రాలు చర్చ
- సమస్యల పరిష్కారం కోసం రెండు కమిటీలు వేయాలని నిర్ణయం
- అధికారులతో ఓ కమిటీ, మంత్రులతో మరో కమిటీ వేయాలని నిర్ణయం
- 1.45 గంటల పాటు సాగిన ముఖ్యమంత్రుల సమావేశం



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ, హైదరాబాద్‌లోని కొన్ని భవనాలను ఇవ్వాలన్న ఆంధ్రప్రదేశ్ విజ్ఞప్తిని తెలంగాణ తోసిపుచ్చినట్లుగా తెలుస్తోంది. హైదరాబాద్‌లోని స్థిరాస్తులను ఏపీకి ఇచ్చేది లేదని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారని అంటున్నారు. అవసరమైతే ఢిల్లీలోని ఏపీ భవన్ తరహాలో హైదరాబాద్‌లో భవనం కట్టుకోవడానికి అనుమతి ఇస్తామని చెప్పారు. భూమి కోసం ఏపీ అర్జీ పెట్టుకోవాలని సూచించినట్లుగా తెలుస్తోంది. చంద్రబాబు, రేవంత్ రెడ్డిల సమావేశం ముగిసింది. అయితే సమావేశంలో తెలంగాణ పలు డిమాండ్లను ఏపీ ముందు ఉంచినట్లుగా మీడియాలో వార్తలు వస్తున్నాయి. తమకు రూ.24 వేల కోట్ల విద్యుత్ బకాయిలు చెల్లించాలని ఏపీ కోరగా... తెలంగాణ నిరాకరించిందని అంటున్నారు. అలాగే, హైదరాబాద్‌లోని ఆస్తులను ఇచ్చేందుకు నిరాకరించింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఐదు గ్రామాలు... ఎటపాక, కన్నాయిగూడెం, పిచ్చుకలపాడు, గుండాల, పురుషోత్తమపట్నంలను తమకు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఈ విజ్ఞప్తికి చంద్రబాబు నుంచి సానుకూల స్పందన వచ్చినట్లుగా తెలుస్తోంది. ఈ భేటీలో ప్రధానంగా రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ చట్టం షెడ్యూల్ 9, 10లో పేర్కొన్న ఆస్తుల పంపకాలపై, విభజన చట్టంలో పేర్కొనని సంస్థల పంపకాలు, ఆంధ్రప్రదేశ్ ఫైనాన్షియల్ కార్పోరేషన్ అంశాలు, పెండింగ్ విద్యుత్ బిల్లులు, విదేశీ రుణ సాయంతో ఉమ్మడి రాష్ట్రంలో ఉమ్మడి ఏపీలో పదిహేను ప్రాజెక్టులు నిర్మించగా... ఇందుకు సంబంధించిన అప్పులపై, ఉమ్మడి సంస్థలకు చేసిన ఖర్చులు, చెల్లింపులపై చర్చించారని సమాచారం. ఉద్యోగుల విభజన అంశాలపై కూడా చర్చించారు.

**తెలుగు రాష్ట్రాల సీఎంల భేటీలో ప్రధానంగా చర్చకు వచ్చిన ప్రధానంశాలు**

1) విభజన చట్టంలో పేర్కొన్న, పేర్కొనని సంస్థల ఆస్తుల పంపకాలు
2) ఏపీ ఫైనాన్షియల్ కార్పొరేషన్ అంశాలు
3) పెండింగ్ విద్యుత్తు బిల్లులు
4)విదేశీ రుణ సాయంతో ఉమ్మడి రాష్ట్రంలో 15 ప్రాజెక్టులు నిర్మించారు. వాటి అప్పుల పంపకాలు
5)ఉమ్మడి సంస్థలకు చేసిన ఖర్చుకు చెల్లింపులు
6)హైదరాబాద్‌లో ఉన్న మూడు భవనాలు ఏపీకి కేటాయించే అంశం
7)లేబర్ సెస్ పంపకాలు
8)ఉద్యోగుల విభజన అంశాలు


## కేసీఆర్‌కు బిగ్ షాక్ ... కాంగ్రెస్‌లోకి మరో ఆరుగురు ఎమ్మెల్యేలు



**హైదరాబాద్ పెన్ పవర్:**సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబును కలిశారు ఆరుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు. కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణా రావు, ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మా రెడ్డి, ఎల్బీ నగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, శేర్లింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, మల్కాజ్ గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద ఉన్నారు. నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి పనులు ప్రతిపాదనలను మంత్రి శ్రీధర్ బాబుకు అందించారు ఎమ్మెల్యేలు. జీహెచ్ఎంసీకి నిధులు విడుదల వివరాలు 2లో..

## ఇక నుంచి ఏడాదికి రెండుసార్లు టెట్...

**తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం**




- ప్రతి సంవత్సరం జూన్‌లో ఓసారి, డిసెంబర్‌లో మరోసారి నిర్వహించాలని నిర్ణయం
- ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ విద్యాశాఖ
- టెట్ మార్కులతో డీఎస్సీలో వెయిటేజీ

వివరాలు 2లో..



## బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఎలా చేర్చుకుంటున్నారు?

పార్టీ ఫిరాయింపులను చేపట్టవద్దని కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో పెట్టిందని విమర్శ

కేకేతో రాజీనామా చేయించిన కాంగ్రెస్... ఎమ్మెల్యేలతో ఎందుకు చేయించడం లేదని నిలదీత

బీఆర్ఎస్‌కు, కాంగ్రెస్‌కి పెద్ద తేడా లేదని మండిపాటు

**హైదరాబాద్ పెన్ పవర్:**పార్టీ ఫిరాయింపులను చేపట్టవద్దని కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో పెట్టిందని... అలాంటప్పుడు ఇతర పార్టీల ఎమ్మెల్యేలను ఎలా చేర్చుకుంటున్నారని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. తమ పార్టీలో చేరిన కె.కేశవరావుతో కాంగ్రెస్ పార్టీ రాజీనామా చేయించిందని గుర్తు చేశారు. మరి బీఆర్ఎస్ నుంచి చేరిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఎందుకు రాజీనామా చేయించడం లేదని నిలదీశారు. వివరాలు 2లో..

## పెండింగ్ అంశాలపై చర్చించాం...

**రేవంత్ రెడ్డి, ఈ భేటీ ద్వారా నమ్మకం కలిగింది...**



- సమావేశం అనంతరం తమ తమ నివాసాలకు చేరుకున్న ముఖ్యమంత్రులు
- మంత్రులతో కలిసి చంద్రబాబు సహా ఏపీ ప్రతినిధులతో సమావేశమయ్యామన్న రేవంత్
- ఇరు రాష్ట్రాలకు ఆమోదయోగ్యంగా ఉండే పరిష్కారాలపై చర్చించామని చంద్రబాబు ట్వీట్
- మంచి వాతావరణంలో సమావేశం జరిగిందన్న మంత్రి శ్రీధర్ బాబు

వివరాలు 2లో..

## వాయిదా పడిన నీట్ యూజీ కౌన్సెలింగ్

- పేపర్ లీక్ ఆరోపణలతో ఎగ్జాం రద్దు కోసం సుప్రీంను ఆశ్రయించిన విద్యార్థులు, పేరెంట్స్
- ఈ నెల 8న విచారించనున్న అత్యున్నత న్యాయస్థానం
- ఈ నేపథ్యంలోనే కౌన్సెలింగ్ రద్దు చేసినట్లు సమాచారం




**హైదరాబాద్ పెన్ పవర్:** నీట్ యూజీ కౌన్సెలింగ్ వాయిదా పడింది. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 6 (శనివారం) న కౌన్సెలింగ్ జరగాల్సి ఉంది. అయితే, నీట్ యూజీ పరీక్ష, వివరాలు 2లో..

## ఈ నెల 22 నుంచి పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు

జులై 22 నుంచి ఆగస్టు 12 వరకు పార్లమెంటు సమావేశాలు

జులై 23న కేంద్ర బడ్జెట్


ఏడోసారి బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నిర్మలా సీతారామన్



**హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్రంలో ఎన్డీయే 3.0 ప్రభుత్వం వచ్చాక మొదటిసారిగా పూర్తి స్థాయి పార్లమెంటు సమావేశాలు నిర్వహించనున్నారు. జులై 22 నుంచి పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు జరగనున్నాయి. బడ్జెట్ సమావేశాలు వివరాలు 2లో..

## తెలంగాణకు వర్షం ముప్పు.. మూడు రోజుల పాటు భారీ వర్షాలు..

**ఎల్లో అలర్ట్ జారీ**



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. రేపు ఎల్లుండి ( జులై 7,8) కూడా భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఇప్పటికే రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వానలు కురుస్తున్నాయి. వికారాబాద్, వివరాలు 2లో..

## త్రిపురలో హెచ్ఐవీ కలకలం.. 47 మంది విద్యార్థుల మృతి!

- మరో 828 మంది విద్యార్థులకు హెచ్ఐవీ పాజిటివ్
- ప్రతిరోజూ 5 నుంచి 7 కొత్త కేసులు నమోదవుతున్నాయన్న టీఎస్ఏసీఎస్
- ప్రస్తుతం రాష్ట్రంలో హెచ్ఐవీతో బాధపడుతున్నవారి సంఖ్య 5,674
- హెచ్ఐవీ కేసుల పెరుగుదలకు మాదకద్రవ్యాల దుర్వినియోగమే కారణమని వెల్లడి

వివరాలు 2లో..




**హైదరాబాద్ పెన్ పవర్:** త్రిపురలో హెచ్ఐవీ కలకలం సృష్టిస్తోంది. రాష్ట్రంలో ఇప్పటివరకు 47 మంది విద్యార్థులు హెచ్ఐవీ బారినపడి మృతిచెందారు. మరో 828 మంది విద్యార్థులకు హెచ్ఐవీ పాజిటివ్‌గా గుర్తించినట్లు త్రిపుర స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (టీఎస్ఏసీఎస్) సీనియర్ అధికారి భట్టాచార్జీ తెలిపారు. ప్రతిరోజూ 5 నుంచి 7 కొత్త కేసులు నమోదవుతున్నాయని వెల్లడించారు. రాష్ట్రంలో మొత్తంగా హెచ్ఐవీతో బాధపడుతున్నవారి సంఖ్య 5,674గా ఉందన్నారు. వీరిలో 4,570 మంది పురుషులు, 1,103 మంది మహిళలు, ఒక ట్రాన్స్‌జెండర్ ఉన్నట్లు వెల్లడించారు. సంపన్న కుటుంబాల విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు

## ఆర్మ్‌స్ట్రాంగ్ మృతి తీవ్ర దిగ్భ్రాంతి కలిగించింది

తమిళనాడు బీఎస్పీ చీఫ్ ఆర్మ్ స్ట్రాంగ్ దారుణ హత్య

ఫుడ్ డెలివరీ బాయ్స్ రూపంలో వచ్చి నరికి చంపిన దుండగులు

ఆర్మ్ స్ట్రాంగ్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపిన రాహుల్ గాంధీ



**హైదరాబాద్ పెన్ పవర్:**:బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు ఆర్మ్ స్ట్రాంగ్ దారుణ హత్యకు గురికావడం పట్ల కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. ఆర్మ్ స్ట్రాంగ్ ను ఆటవిక రీతిలో, దారుణంగా నరికి చంపడం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని తెలిపారు. ఈ విషాద సమయంలో ఆర్మ్ స్ట్రాంగ్ కుటుంబానికి, స్నేహితులకు, అనుచరులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. తమిళనాడు కాంగ్రెస్ నేతలు రాష్ట్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారని, నిందితులను త్వరలోనే న్యాయస్థానం ముందుకు తీసుకువచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్న నమ్మకం ఉందని తెలిపారు.

## సంపాదకీయం

# నానో ట్రాక్టర్... ఇది రైతులకు ఎంతో ఉపయోగం...

వ్యవసాయంలో రోజు రోజుకూ మెషినరీ అవసరం పెరుగుతోంది. అందుకు అనుగుణంగానే కొత్త కొత్త టెక్నాలజీతో అనేక మెషిన్లు అందుబాటులోకి వస్తున్నాయి. దాంతో చిన్న, సన్నకారు రైతులు కూడా మెషిన్లపైనే ఆధారపడుతున్నారు. చాలామంది కాడెడ్లకు బదులు ట్రాక్టర్లతో దున్నుతున్నారు. కాకపోతే స్తోమత ఉన్నవాళ్లు సొంతంగా ట్రాక్టర్ కొనుక్కుంటుంటే.. లేనివాళ్లు కిరాయికి తెచ్చుకుని పొలం దున్నించుకుంటున్నారు. కానీ.. అది తలకు మించిన భారం అవుతోంది. అలాంటి వాళ్లకోసమే ఈ జుగాడ్ ఆలోచనతో 'నానో ట్రాక్టర్ లు మార్కెట్? లోకి వచ్చేశాయి.తయారు చేశాడు మెకానిక్ బ్రహ్మచారి.

ఎద్దులతో పొలం దున్నడం చాలా తగ్గిపోయింది.. ఇప్పుడు చాలామంది రైతులకు ఎడ్లే లేవు. అందరూ ట్రాక్టర్లపైనే ఆధారపడుతున్నారు. అందుకే చిన్న రైతుల కోసం ఒక చిన్న ట్రాక్టర్?ను తయారు చేశాడ ఓ ఇంజనీరు యాదారం బ్రహ్మచారి. అనుకున్న వెంటనే తయారీ మొదలుపెట్టాడు. ఎన్ని అడ్డంకులు వచ్చినా... అధిగమించి సామాన్య రైతులకు కూడా అందుబాటులో ఉండేవిధంగా ఒక ట్రాక్టర్ను తయారు చేశాడు.

ఆ యువ ఇంజనీరు బ్రహ్మచారి ఆరోతరగతి వరకు చదువుకున్నాడు. తర్వాత వెల్డింగ్ పని నేర్చుకుని షాపు పెట్టుకున్నాడు. రైతులకు ఉపయోగపడే కర్రు, ఇనుప నాగళ్లను తయారు చేస్తుంటాడు. తన షాపునే ఒక ప్రయోగశాలగా మార్చుకుని ట్రాక్టర్ తయారీకి రెడీ అయ్యాడు. చాలా రోజులపాటు కష్టపడి ఒక ట్రాక్టర్ను తయారుచేశాడు. ఆ తర్వాత దానికి కొన్ని మార్పులు చేసి అందుబాటులోకి తీసుకొచ్చాడు. ఏ మాత్రం డ్రైవింగ్ అనుభవం లేని రైతు కూడా దీన్ని నడపొచ్చు. పెద్ద ట్రాక్టర్? తో కూడా చేయలేని కొన్ని పనులు దీంతో చేయొచ్చు. ముఖ్యంగా అంతర పంటల సాగుకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది. ఈ ట్రాక్టర్ టన్ను బరువును లాగగలదు. ట్రాలీని తగిలించినా పరుగులు పెడుతోంది. మరో విశేషం ఏంటంటే.. దీనికి డైనమో కూడా బిగించుకోవచ్చు. ఈ డైనమోతో కరెంట్ లేనప్పుడు బోరు బావిలోని మోటారును నడిపించవచ్చు..

**నానో ట్రాక్టర్ స్పెషాలిటీస్**

ఈ చిట్టి ట్రాక్టర్ బరువు 150కిలోలు, నాలుగు అడుగుల పొడవు, 30 ఇంచుల వెడల్పు, రెండు అడుగుల ఎత్తు, ఇంజిన్ కెపాసిటీ 4హెచ్ పీ(హార్స్ పవర్), డీజిల్, పెట్రోల్తో నడిచే ఈ ట్రాక్టర్ తయారు చేయడానికి లక్షా 40వేల రూపాయలు ఖర్చయింది. ఈ ట్రాక్టర్ నడవాలంటే గంటకు ఒక లీటర్ డీజిల్ కావాలి.

గంటకు 10 నుండి 15 కిలోమీటర్ల స్పీడుతో నడుస్తుంది. దీనికి ఐదు గేర్లు ఉంటాయి. అందులో ఒకటి రివర్స్ గేర్.. స్టీరింగ్ దగ్గరే బ్రేక్, గేర్ లు ఉంటాయి. మొత్తం చేతులతోనే ఆపరేట్ చెయ్యొచ్చు. కాలితో చేయాల్సిన పని ఏమీ ఉండదు. త్వరలోనే దీనికి హైడ్రాలిక్ సిస్టమ్? ను కూడా జోడిస్తానంటున్నాడు చారి. హైడ్రాలిక్ ఉంటే.. దున్నేటప్పుడు రాళ్లు అడ్డుపడితే చెయ్యి పెట్టి తియ్యాల్సిన పని తప్పుతుంది.

**అన్ని పనులూ..**

ఈ ట్రాక్టర్ను ఉపయోగించి అన్ని రకాల పనులూ చేసుకోవచ్చు. సాళ్లకు తగినట్లు 4 అంగుళాల వెడల్పు వరకు తగ్గించుకోవటం, పెంచుకోవటం చేసుకోవచ్చు. సాళ్ల మధ్య కలుపు మొక్కలను కూడా తొలగించవచ్చు. మెదట్లో ఒక్క గేరుతో నడిచే నానో ట్రాక్టర్? తయారు చేశానని. అప్పుడు 75వేల రూపాయలు ఖర్చయ్యాయని బ్రహ్మచారి తెలిపారు. ఆ తరువాత కొన్ని మార్పులు చేసి కొత్తగా ఐదు గేర్లతో అందుబాటులోకి తీసుకొచ్చానని తెలిపాడు. ఉద్యానవన పంటల్లో చెట్ల చుట్టూ దున్నుకోవచ్చు. గొర్రు, దంతె, రోటోవేటర్ లాంటివాటిని బిగించుకోవచ్చు. అంతేకాకుండా గ్రామాలు, పట్టణాల్లో ఇరుకు వీధుల్లో కూడా చెత్త రవాణాకు వినియోగించవచ్చు. దీని మెయింటెనెన్స్ ఖర్చు కూడా తక్కువే కాబట్టి పేద రైతులకు కూడా ఉపయోగకరంగా ఉంటుంది.

# పెండింగ్ అంశాలపై చర్చించాం...

**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్లోని ప్రజాభవన్లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమయ్యామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సమావేశం అనంతరం ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ముఖ్యమంత్రుల సమావేశం దాదాపు రెండు గంటలు కొనసాగింది. ఆ తర్వాత చంద్రబాబు, రేవంత్ రెడ్డిలు జూబ్లీహిల్స్లోని తమ తమ నివాసాలకు చేరుకున్నారు. అనంతరం రేవంత్ రెడ్డి ట్వీట్ చేశారు.

ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్తో కలిసి ఏపీ సీఎం చంద్రబాబు, ఆ రాష్ట్ర మంత్రులు, అధికారులతో సమావేశమైనట్లు తెలిపారు. రాష్ట్ర విభజన తర్వాత సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న అంశాలపై పరిష్కారం కోసం చర్చించినట్లు పేర్కొన్నారు.

**ఇరు రాష్ట్రాలకు మేలు కలుగుతుందనే నమ్మకం కలిగిందన్న చంద్రబాబు**

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో హైదరాబాద్లో మంత్రివర్గ సహచరులతో కలిసి సమావేశమై విభజన సమస్యలపై చర్చలు జరిపామని చంద్రబాబు ట్వీట్ చేశారు. దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న సమస్యలకు ఇరు రాష్ట్రాలకు ఆమోదయోగ్యంగా ఉండే పరిష్కారాలపై ఈ సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు పరస్పరం సహకరించుకునే విధంగా చర్చలు సాగాయని, ఇరురాష్ట్రాలకు మేలు కలుగుతుందనే నమ్మకం ఈ సమావేశం ద్వారా కలిగిందని పేర్కొన్నారు.

**మంచి వాతావరణంలో సమావేశం జరిగింది: శ్రీధర్ బాబు**

మంచి వాతావరణంలో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం జరిగిందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. విభజన అంశాలపై అధికారుల కమిటీని వేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ముఖ్యమంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు మరోసారి కూర్చొని చర్చిస్తారని తెలిపారు. ఏడు మండలాలు, విద్యుత్ బకాయిలు... ఇలా ప్రతి అంశంపై అధికారుల కమిటీ నిర్ణయం తీసుకుంటుందన్నారు. అప్పటికీ పరిష్కారం కాకుంటే కేంద్రం వద్దకు వెళతామన్నారు.

# కేసీఆర్కు బిగ్ షాక్ ... కాంగ్రెస్లోకి మరో ఆరుగురు ఎమ్మెల్యేలు

- మొదటి పేజీ తరువాయి

చేయాలని మంత్రిని కోరారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన నుంచి జీహెచ్ఎంసీకి నిధులు ఇవ్వలేదన్నారు. కూకట్ పల్లి నియోజకర్గంలోని చెరువులు, కుంటల్లో పెరిగిపోయిన గుర్రపు డెక్క తొలగించాలని.. దోమలను నివారించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. నియోజకర్గంలోని అన్ని డివిజన్ లలో ఎలక్ట్రికల్ పోల్స్, వీధి దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. కూకట్ పల్లి, మూసాపేట్ సర్కిళ్ళ పరిధిలో నెలకొన్న శానిటేషన్ సమస్యలు పరిష్కరించాలని, అలాగే కూకట్ పల్లి నియోజకవర్గం లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్యే ల విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు రాజకీయాలకు అతీతంగా పనులు చేయడం జరుగుతుందన్నారు. తప్పకుండా మీ సమస్యలను తీరుస్తామని హామీ ఇచ్చారు.

**రేపో మాపో జంప్?**

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మంత్రిని కలవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే ఏడుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఆరుగురు ఎమ్మెల్సీలు కాంగ్రెస్ లో చేరిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఈ ఆరుగురు ఎమ్మెల్యేలు కూడా రేపో మాపో బీఆర్ఎస్ ను వీడి కాంగ్రెస్ లో చేరుతారనే ప్రచారం జరుగుతోంది. బీఆర్ఎస్ కు చెందిన 20 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరుతారని ఇప్పటికే పలువురు మంత్రులు చెప్పిన సంగతి తెలిసిందే..

# ఇక నుంచి ఏడాదికి రెండుసార్లు టెట్...

**హైదరాబాద్ పెన్ పవర్:**ఏడాదికి రెండుసార్లు టెట్ (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు విద్యాశాఖ శనివారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతి సంవత్సరం జూన్ నెలలో ఓసారి, డిసెంబర్ నెలలో మరోసారి టెట్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఒక అభ్యర్థి ఎన్నిసార్లు అయినా టెట్ పరీక్ష రాయవచ్చునని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

టెట్లో ఉత్తీర్ణత సాధించిన వారికే డీఎస్సీ రాయడానికి అవకాశం కల్పించనున్నారు. టెట్ మార్కులను డీఎస్సీలో వెయిటేజీ ఇవ్వనున్నారు. గతంలో, నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్సీటీఈ) ప్రతి సంవత్సరం రెండుసార్లు టెట్ నిర్వహించాలని రాష్ట్రాలను ఆదేశించింది. అలాగే కేంద్ర ప్రభుత్వం టెట్ గడువును జీవితకాలానికి పెంచింది. దీంతో ఒక్కసారి క్వాలిఫై అయితే, మరోసారి రాయాల్సిన అవసరం లేదు. టెట్ మార్కులకు డీఎస్సీలో వెయిటేజీ ఉండటంతో కేవలం ఇప్పటికే టెట్ క్వాలిఫై అయిన అభ్యర్థులు తమ స్కోర్ పెంచుకునేందుకు మాత్రం రాసుకోవచ్చు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఎలా చేర్చుకుంటున్నారు?

- మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహారంపై ప్రజలు ఆలోచన చేస్తున్నారని పేర్కొన్నారు. గ్రూప్-1 నిరుద్యోగులు ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. బీఆర్ఎస్కు, కాంగ్రెస్కి పెద్దగా తేడా లేదని విమర్శించారు.

# ఈ నెల 22 నుంచి పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు

- మొదటి పేజీ తరువాయి

ఆగస్టు 12 వరకు కొనసాగనున్నాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ జులై 23న బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. ఈ మేరకు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు.

నిర్మలా సీతారామన్ తాజాగా ఆర్బీఐ గవర్నర్ తో సమావేశమయ్యారు. బడ్జెట్ కేటాయింపుల అంశంపై చర్చించారు. నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టడం ఇది ఏడోసారి. ఈసారి ఏపీలో ఎన్డీయే కూటమి పార్టీలు అధికారంలో ఉండడంతో, రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్ కేటాయింపులు ఎలా ఉండబోతున్నాయన్నది ఆసక్తి కలిగిస్తోంది.

# తెలంగాణకు వర్షం ముప్పు.. మూడు రోజుల పాటు భారీ వర్షాలు..

- మొదటి పేజీ తరువాయి

సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, వనపర్తి, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, సిద్దిపేట, గద్వాల్, నారాయణపేట జిల్లాల్లో భారీ వర్షం కురుస్తుంది. ఈ మేరకు ఆయా జిల్లాల అధికారులను వాతావరణ కేంద్రం అప్రమత్తం చేసింది. వర్షంతో పాటు భారీ ఈదురు గాలులు కూడా వీచే అవకాశం ఉంది. ఈరోజు రాత్రికి ( జులై 6) హైదరాబాద్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నందున ఎల్లో అలర్ట్ ప్రకటించారు. ఈరోజు ( జులై 6) సాయంత్రం కురిసిన వర్షంతో హైదరాబాద్ తడిసిముద్దయింది. కొత్తపేట, మలక్ పేట, దిల్ సుఖ్ నగర్, చైతన్యపురి, వనస్థలిపురం, ఉప్పల్, నాగోల్, బేగంపేట ప్రాంతాల్లో భారీ వర్షం కురియడంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి.

రోడ్లపై భారీ వర్షం నీరు నిలవడంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జీహెచ్ఎంసీ, విపత్తు నిర్వహణ బృందం ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టింది.

రానున్న మూడు రోజుల పాటు తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తూ ముందస్తు ఏర్పాట్లు చేశారు. వీకెండ్ కావడంతో జనం పెద్దఎత్తున బయటకు వచ్చే అవకాశం ఉందని%ొ% అవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని అధికారులు హెచ్చరించారు. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో వర్షం కురిసే అవకాశం ఉన్నందున ట్రాఫిక్కు ఇబ్బంది కలుగుతుందని సూచిస్తున్నారు.

# తూ..తూ మంత్రంగా కాదు... ఇదే చివరి భేటీ అన్నట్లుగా ఉండాలి: చంద్రబాబు-రేవంత్ భేటీపై రఘునందన్ రావు సూచన

**పదేళ్లుగా పెండింగ్లో ఉన్న సమస్యలను పరిష్కరించేలా సమావేశం ఉండాలని వ్యాఖ్య**

**స్నేహపూర్వక వాతావరణంలో భేటీ సఫలం కావాలన్న రఘునందన్ రావు**

**ఈ సమావేశం ఫలితాలు ఇరురాష్ట్రాల ప్రజలకు ఆనందం పంచేలా ఉండాలని ఆకాంక్ష**



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిల మధ్య ఎప్పటి నుంచో సత్సంబంధాలు ఉన్నాయని... కాబట్టి నేటి సమావేశంలో పదేళ్లుగా పెండింగ్లో ఉన్న సమస్యలపై తూతూ మంత్రంగా కాకుండా, ఇదే చివరి సమావేశం అన్నట్లుగా జరగాలని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు సూచించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ప్రజాభవన్ వేదికగా ఈరోజు సాయంత్రం 6 గంటలకు ఇరు రాష్ట్రాల సీఎంలు భేటీ కాబోతున్నారని... ఈ సమావేశం ఫలితాలు రెండు రాష్ట్రాల ప్రజలకు ఆనందం పంచేలా ఉండాలని ఆకాంక్షించారు.

చంద్రబాబు, రేవంత్ రెడ్డిని గురుశిష్యులు అంటారా? రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు అంటారా?... ఏదైనా పదేళ్లుగా పెండింగ్లో ఉన్న సమస్యలను పరిష్కరించేలా వారి సమావేశం ఉండాలన్నారు. స్నేహపూర్వక వాతావరణంలో ఈ భేటీ సఫలం కావాలన్నారు. వీరిద్దరూ గతంలో చాలాకాలం ఒకే పార్టీలో ఉన్నారని గుర్తు చేశారు.ఏపీలో పని చేస్తున్న ఉద్యోగులను తెలంగాణకు తీసుకువచ్చేలా చర్చలు ఫలప్రదం కావాలన్నారు. భేటీలో ముఖ్యంగా న్యాయపరమైన ఆస్తుల విషయంలో సుదీర్ఘ చర్చలు జరిపి వాటిని పరిష్కరించుకోవాలన్నారు. సమస్యల పరిష్కారానికి ఇద్దరు ముఖ్యమంత్రులూ చొరవ చూపాలని సూచించారు.

# వాయిదా పడిన నీట్ యూజీ కౌన్సెలింగ్

- మొదటి పేజీ తరువాయి

కౌన్సెలింగ్ కు సంబంధించి పలు ఆరోపణలు వెల్లువెత్తడంతో పలువురు విద్యార్థులు, పేరెంట్స్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనికి సంబంధించి దాఖలైన వివిధ పిటిషన్లను ఈ నెల 8న విచారించనున్నట్లు అత్యున్నత న్యాయస్థానం వెల్లడించింది. ఈ నేపథ్యంలోనే నీట్ యూజీ కౌన్సెలింగ్ వాయిదా పడ్డట్లు సమాచారం. తదుపరి ప్రకటన వచ్చే వరకు కౌన్సెలింగ్ను వాయిదా వేసినట్లు అధికారిక వర్గాలు ప్రకటించాయి.

నీట్ యూజీ పరీక్షలో అవకతవకలు జరిగాయని, పేపర్ లీక్ అయిందని ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో ఆందోళన చెందిన పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు కోర్టు మెట్లెక్కారు. నీట్ పరీక్షను రద్దు చేయాలని, ఈమేరకు ప్రభుత్వానికి ఆదేశాలివ్వాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. పలువురు విద్యావేత్తలు కూడా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై సుప్రీంకోర్టు గతంలో స్పందిస్తూ.. పరీక్షను రద్దు చేయడం, కౌన్సెలింగ్ ను వాయిదా వేయడం కుదరదని వ్యాఖ్యానించింది. అయితే, నీట్ యూజీ పరీక్షకు సంబంధించిన పిటిషన్లను విచారించేందుకు సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్థీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం అంగీకరించింది.

# ఓయూలో చంద్రబాబు, రేవంత్ రెడ్డిల చిత్రపటాలకు క్షీరాభిషేకం

**వివాదాల పరిష్కారం కోసం చంద్రబాబు ముందుకు రావడం హర్షణీయమని వ్యాఖ్య**

**ప్రారంభమైన ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీ**

**ప్రజాభవన్ వద్ద చంద్రబాబుకు స్వాగతం పలికిన రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్లోని ఉస్మానియా యూనివర్సిటీలో ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డిల చిత్రపటానికి కొంతమంది విద్యార్థులు క్షీరాభిషేకం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన హామీలు, ఇతర వివాదాల పరిష్కారం కోసం చంద్రబాబు ముందుకు రావడం హర్షణీయమని ఇక్కడి చంద్రబాబు ఫ్యాన్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు, ఓయూ పీహెచ్డీ విద్యార్థి తలారి శ్రీనివాస్ రావు అన్నారు.

**చంద్రబాబుకు రేవంత్ రెడ్డి ఘన స్వాగతం**

ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం సాయంత్రం ఆరు గంటల సమయంలో ప్రారంభమైంది. ప్రజాభవన్లో ఈ సమావేశం జరుగుతోంది. ప్రజాభవన్కు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తదితరులు ముందుగా వచ్చారు. ఆ తర్వాత ప్రజాభవన్కు వచ్చిన చంద్రబాబు, ఏపీ మంత్రులు, అధికారులకు తెలంగాణ సీఎం, ఉపముఖ్యమంత్రి ఘన స్వాగతం పలికారు.

# త్రిపురలో హెచ్ఐవీ కలకలం.. 47 మంది విద్యార్థుల మృతి!

- మొదటి పేజీ తరువాయి

ఈ మహమ్మారి బారిన పడుతున్నారని తెలిపారు.

ఇక హెచ్ఐవీ కేసుల పెరుగుదలకు మాదకద్రవ్యాల దుర్వినియోగమే కారణమని చెప్పారు. సంపన్న కుటుంబాల తల్లిదండ్రులు తమ పిల్లలు మాదకద్రవ్య వ్యసనానికి గురయ్యారని గ్రహించే సమయానికి అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోతుందని భట్టాచార్జీ వివరించారు. త్రిపుర జర్నలిస్ట్ యూనియన్, వెబ్ మీడియా ఫోరమ్, టీఎస్ఏసీఎస్ ఇటీవల సంయుక్తంగా నిర్వహించిన మీడియా వర్క్షాప్లో ఈ పెరుగుతున్న సంక్షోభం వెనుక ఉన్న వాస్తవాలను తెరపైకి తెచ్చారు.

# మహిళా ప్రిన్సిపాల్ చేత బలవంతంగా సీటు ఖాళీ చేయించిన స్కూల్ యాజమాన్యం.. అసలేం జరిగిందంటే..!

- యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో ఘటన
- ఫిబ్రవరి 11న బిషప్ జాన్సన్ బాలికల స్కూల్ పరీక్షా కేంద్రంలో జరిగిన యూపీపీఎస్సీ పరీక్ష పేపర్ లీక్
- ఈ స్కామ్‌లో ప్రిన్సిపాల్ పరుల్ సోలమన్‌కు ప్రమేయం ఉందని ఆరోపణలు
- దాంతో ఆమెను ప్రిన్సిపాల్ పదవి నుంచి తప్పించిన స్కూల్ యాజమాన్యం
- కానీ, పరుల్ మాత్రం తన సీటును ఖాళీ చేసేందుకు ససేమీరా
- దాంతో చేసేదేమీలేక ఆమెను బలవంతంగా తొలగించిన వైనం



**హైదరాబాద్ పెన్ పవర్:** యూపీలోని ఓ బాలికల పాఠశాల మహిళా ప్రిన్సిపాల్‌ను బలవంతంగా తొలగించి, ఆమె సీటు ఖాళీ చేయించిన వీడియో ఒకటి ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో ఈ సంఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఈ ఏడాది ఫిబ్రవరి 11వ తేదీన యూపీపీఎస్సీ రివ్యూ ఆఫీసర్, అసిస్టెంట్ రివ్యూ ఆఫీసర్ పరీక్ష నిర్వహించింది. దీనిలో భాగంగా బిషప్ జాన్సన్ బాలికల పాఠశాలకు కూడా పరీక్షా కేంద్రాన్ని కేటాయించింది. అయితే, ఈ ఎగ్జామ్ సెంటర్‌లో పేపర్ లీక్ అయ్యింది. దాంతో స్కూల్ నిర్వాహకుడు వినీత్ జస్వంత్‌ను స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే, ఈ పేపర్ లీకేజీలో పాఠశాల ప్రిన్సిపాల్ పరుల్ సోలమన్‌కు ప్రమేయం ఉందని ఆరోపణలు వచ్చాయి. దాంతో స్కూల్ యాజమాన్యం ఆమెను ప్రిన్సిపాల్ పదవి నుంచి తప్పించింది. ఆమె స్థానంలో షెర్లిన్ మాస్సేను కొత్త ప్రిన్సిపాల్‌గా నియమించారు.

తాజాగా కొత్త ప్రిన్సిపాల్ బాధ్యతలు చేపట్టేందుకు రాగా.. పరుల్ సోలమన్ మాత్రం తన సీటును ఖాళీ చేసేందుకు ససేమీరా అన్నారు. దాంతో ఆ సంస్థ ఛైర్మన్ బిషప్ మారిస్ ఎడ్గార్ డాన్ నేతృత్వంలో స్కూల్ సిబ్బంది ప్రిన్సిపాల్ ఆఫీస్‌లోకి వచ్చి ఆమెను సీటు ఖాళీ చేయాల్సిందిగా కోరారు. కానీ, ఆమె నిరాకరించారు.

దాంతో చేసేదేమీలేక ఆమె చేతిలోని మొబైల్ ఫోన్ లాక్కున్నారు. అనంతరం పరుల్ కూర్చొన్న ఛైర్‌ను ముందుకు లాగి బలవంతంగా ఖాళీ చేయించారు. ఆ తర్వాత కొత్త ప్రిన్సిపాల్ షెర్లిన్ మాస్సేను ఆ సీటులో కూర్చోబెట్టి అక్కడున్న సిబ్బంది ఆమెను అభినందించారు. ఇక ప్రిన్సిపాల్ సీటును బలవంతంగా ఖాళీ చేయించడంపై పరుల్ సోలమన్ పోలీసులను ఆశ్రయించారు. తనను లైంగికంగా వేధించారని ఆమె ఆరోపించారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# చంద్రబాబుతో భేటీ కోసం... ప్రజాభవన్‌కు చేరుకున్న రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ నేపథ్యంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌కు చేరుకున్నారు. కాసేపట్లో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు భేటీ కానున్నారు. ఈ భేటీలో ఇరు రాష్ట్రాలకు చెందిన మంత్రులు, అధికారులు పాల్గొంటున్నారు. ఈ భేటీలో చర్చించేందుకు తెలుగు రాష్ట్రాల అధికారులు పది అంశాల అజెండాను సిద్ధం చేశారు.

**ఉపముఖ్యమంత్రితో ముఖ్యమంత్రి భేటీ**

చంద్రబాబుతో భేటీ కావడానికి ముందు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కతో రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఏపీ సీఎంతో భేటీ సందర్భంగా చర్చించాల్సిన అంశాలపై వారు మాట్లాడుకున్నారు. మరోవైపు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, మంత్రులు, అధికారులతో చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. తెలంగాణ సీఎంతో చర్చించే అంశాలపై వారు చర్చించారు.

# రాజ్ తరుణ్ వ్యవహారంలో కీలక పరిణామం... లావణ్యకు నోటీసులు ఇచ్చిన పోలీసులు

- రాజ్ తరుణ్ తనను మోసం చేశాడంటూ నిన్న పోలీసులకు ఫిర్యాదు చేసిన లావణ్య
- ఫిర్యాదులో పేర్కొన్న అంశాలకు ఆధారాలు ఇవ్వాలన్న పోలీసులు
- నోటీసులకు, ఫోన్ కాల్ కు స్పందించని లావణ్య



**హైదరాబాద్ పెన్ పవర్:** హీరో రాజ్ తరుణ్ పై లావణ్య అనే యువతి నిన్న నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేయడం తెలిసిందే. రాజ్ తరుణ్ తనను ప్రేమ, పెళ్లి అంటూ మోసం చేశాడని... ఇంటి నుంచి వెళ్లిపోయి మళ్లీ తనవద్దకు రాలేదని లావణ్య పోలీసులను ఆశ్రయించింది. హీరోయిన్ మాల్వీ మల్హోత్రా మాయలో పడి తనను వదిలేశాడని ఆరోపించింది. అయితే, ఈ వ్యవహారం ఆసక్తికర మలుపు తిరిగింది. ఫిర్యాదు చేసిన లావణ్యకు పోలీసులు నోటీసులు పంపించారు. నిన్న ఫిర్యాదులో పేర్కొన్న అంశాలపై ఆధారాలు ఇవ్వాలంటూ పోలీసులు నోటీసుల్లో కోరారు. అయితే ఆమె ఈ నోటీసులకు స్పందించలేదు. అంతేకాదు, ఫోన్ కాల్ కు కూడా ఆమె అందబాటులోకి రాలేదు. కాగా, లావణ్య చేసిన ఫిర్యాదు సరైన ఫార్మాట్ లో లేదని పోలీసులు చెబుతున్నారు. తారీఖు, సమయం, ప్లేస్... ఇలా ఏదీ లేకుండా ఫిర్యాదు చేసినట్టు వివరించారు. సాయంత్రం లోపు లావణ్య నుంచి స్పందన రాకపోతే... కోర్టు అనుమతి తీసుకుని అది తప్పుడు ఫిర్యాదుగా పరిగణిస్తామని పోలీసులు తెలిపారు.

# 14 ఏళ్లు నెదర్లాండ్స్ కు ప్రధానిగా సేవలు.. ఓటమి తర్వాత కొత్త పీఎంకు బాధ్యతలు అప్పగించి.. సైకిల్‌పై ఇంటికి!

- నెదర్లాండ్స్ ప్రధానిగా 14 ఏళ్లు సేవలందించిన మార్క్ రుట్టే
- కొత్త పీఎంగా ఎన్నికైన డిక్ షూఫ్‌కు బాధ్యతల అప్పగింత
- అనంతరం సాధారణ పౌరుడిగా సైకిల్ తొక్కుంటూ వెళ్లిపోయిన రుట్టే



**హైదరాబాద్ పెన్ పవర్:** నెదర్లాండ్స్ ప్రధానమంత్రిగా 14 ఏళ్లు సేవలందించిన మార్క్ రుట్టే ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఓడిపోయిన విషయం తెలిసిందే. అయితే కొత్త పీఎంగా ఎన్నికైన డిక్ షూఫ్‌కు అధికారికంగా బాధ్యతలు అప్పగించి రుట్టే సాధారణ పౌరుడిగా సైకిల్ తొక్కుంటూ వెళ్లిపోయారు. అయితే, ఇలా చేయడం ఆ దేశ ఆచారమని అంటున్నారు. ఎలాగైతే ఖాళీ చేతులతో ప్రజలకు ప్రాతినిధ్యం వహించడానికి వచ్చారో, అలాగే వెళ్లిపోవడం అక్కడ జరుగుతుందట.

అలా రుట్టే సైకిల్‌పై వెళ్లిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వీడియోలో ఆయన సైకిల్‌పై అధ్యక్ష భవనం నుంచి బయటకు వస్తున్న సమయంలో కొంతమంది రుట్టేను చప్పట్లు కొట్టి ప్రశంసించడం వీడియోలో చూడొచ్చు. అయితే, రుట్టేకు 'సైకిల్ రైడ్' చేయడం ఇదే తొలిసారి కాదు. ఇంతకుముందు కూడా సభలకు సైకిల్‌పై వచ్చి తన నిరాడంబరతను, అంకితభావాన్ని చాటారాయన.

ఇక 14 ఏళ్లు నెదర్లాండ్స్ ప్రధానిగా సేవలు అందించిన మార్క్ రుట్టే.. వచ్చే ఏడాది 'నాటో' కొత్త సెక్రటరీ జనరల్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు.

# టీటీడీ బోర్డులో తెలంగాణ నుంచి ఇద్దరికి అవకాశం కావాలన్న కొండా సురేఖ

- దేవాదాయ శాఖ భూములకు సంబంధించిన అంశాలపై చర్చ జరగాలన్న మంత్రి
- తెలంగాణ ఆలయాలకు టీటీడీ నుంచి రూ.10 లక్షలు రావాలన్న సురేఖ
- నిన్న సాయంత్రం చంద్రబాబు, రేవంత్ రెడ్డిల సమావేశం



**హైదరాబాద్ పెన్ పవర్:** తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) బోర్డులో తెలంగాణ నుంచి ఇద్దరికి అవకాశం ఇవ్వాలని మంత్రి కొండా సురేఖ అన్నారు. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీలో దేవాదాయ శాఖ భూములకు సంబంధించిన అంశాలపై చర్చ జరగాలని కోరారు. తెలంగాణలోని ఆలయాలకు టీటీడీ నుంచి రూ.10 లక్షలు రావాలని విజ్ఞప్తి చేశారు.

**ఆషాడ బోనాల ఉత్సవాలు**

బేగంపేటలోని హోటల్ హరిత టూరిజం ప్లాజాలో ఆషాడ బోనాల దశాబ్ద ఉత్సవాల దేవాలయాల కమిటీలకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, హైదరాబాద్ ఇంఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ... రాష్ట్రమంతా సమృద్ధిగా వర్షాలు పడి, మంచి పంటలు పండాలని, ప్రజలంతా సంతోషంగా ఉండాలని అమ్మవారిని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. జులై 7 నుంచి గోల్కొండ బోనాలతో ఆషాడ మాస బోనాల ఉత్సవాలు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. బోనాల ఉత్సవాలను ఘనంగా జరిపేందుకు

ప్రభుత్వం తరపున అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వం ఎన్ని ఏర్పాట్లు చేసినప్పటికీ ఉత్సవాలు విజయవంతం కావాలంటే ప్రజల సహకారం అవసరమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అదనపు నిధులు తీసుకువచ్చినట్లు చెప్పారు. నిర్వహణలో లోటుపాట్లు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

# టాలీవుడ్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ స్వప్న ఆత్మహత్య

- మృతురాలు స్వప్న వర్మది రాజమండ్రి
- ఇండస్ట్రీలో సెటిల్ కావాలని మూడేళ్ల క్రితం హైదరాబాద్ కు వచ్చిన స్వప్న
- ఆరు నెలలుగా అవకాశాలు రాకపోవడంతో మానసిక ఒత్తిడికి గురైన వైనం



**హైదరాబాద్ పెన్ పవర్:** టాలీవుడ్ లో మరో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ స్వప్న వర్మ ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె వయసు 33 ఏళ్లు. తెలుగు సినీ పరిశ్రమలో కొన్నేళ్లుగా ఆమె ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ గా పని చేస్తోంది. రాజమండ్రికి చెందిన స్వప్న ఇండస్ట్రీలో స్థిరపడాలని మూడేళ్ల క్రితం హైదరాబాద్ కు వచ్చింది. మాదాపూర్ కావూరి హిల్స్ లోని తీగల హౌస్ అపార్ట్ మెంట్ లోని 101 ఫ్లాట్ లో ఆమె ఒంటరిగా నివాసం ఉంటోంది. అయితే, గత ఆరు నెలలుగా తనకు ఎలాంటి ప్రాజెక్ట్ రాకపోవడంతో ఆమె తీవ్ర మానసిక ఒత్తిడికి గురైనట్టు సమాచారం. ఈ ఒత్తిడితోనే ఆమె రెండు రోజుల క్రితం తన ఫ్లాట్ లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఫ్లాట్ లో ఆమెతో పాటు ఎవరూ లేకపోవడంతో ఆమె ఆత్మహత్య విషయం బయటకు తెలియరాలేదు. అయితే, బాడీ డీకంపోజ్ కావడం వల్ల చెడు వాసన రావడంతో చుట్టుపక్కల వాళ్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి చూడగా స్వప్న విగతజీవిగా కనిపించింది. ఆమె డెడ్ బాడీని పోస్ట్ మార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# సీఎంల సమావేశం.. రెండు రాష్ట్రాల తరపున హాజరవుతున్నది వీరే!



**హైదరాబాద్ పెన్ పవర్:** విభజన సమస్యలను పరిష్కరించుకోవడమే ఏకైక అజెండాగా ఇరు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డి కాసేపట్లో భేటీ కాబోతున్నారు. హైదరాబాద్ లోని ప్రజాభవన్ లో సాయంత్రం 6 గంటలకు వీరి సమావేశం జరగబోతోంది. ఎన్నో విభజన సమస్యలు గత పదేళ్లుగా పెండింగ్ లో ఉన్నాయి. ఇప్పుడు ఇరువురు ముఖ్యమంత్రుల మధ్య చర్చలు సామరస్యపూర్వకంగా జరిగితే... మెజార్టీ సమస్యలు పరిష్కారమయ్యే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మరోవైపు, ఇరువురు సీఎంల సమావేశానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఏపీ ప్రభుత్వం తరపున సీఎం చంద్రబాబు, మంత్రులు కందుల దుర్గేశ్, అనగాని సత్యప్రసాద్, బీసీ జనార్దన్ రెడ్డి, చీఫ్ సెక్రటరీ, మరో ఇద్దరు అధికారులు హాజరుకానున్నారు. తెలంగాణ నుంచి సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, చీఫ్ సెక్రటరీ, మరో ఇద్దరు అధికారులు హాజరుకానున్నారు. ఇప్పటికే సీఎంల సమావేశానికి సంబంధించిన అజెండా ఖరారయింది.

# తిరుమల దర్శనంలో తెలంగాణ సిఫార్సు లేఖలపై చంద్రబాబును అడగండి: రేవంత్ రెడ్డికి తుమ్మల లేఖ

- తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలను పరిగణనలోకి తీసుకునేలా కోరాలన్న మంత్రి
- మన లేఖలకు టీటీడీ ప్రాధాన్యం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని చంద్రబాబును అడగాలన్న తుమ్మల
- చంద్రబాబు, రేవంత్ రెడ్డిల కీలక భేటీ



**హైదరాబాద్ పెన్ పవర్:** కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి వారి దర్శనంలో తెలంగాణ సిఫార్సు లేఖలపై ముఖ్యమంత్రుల భేటీలో కోరాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి తుమ్మల నాగేశ్వర రావు లేఖ రాశారు. తిరుమల దర్శనంలో తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలను పరిగణనలోకి తీసుకునేలా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ సందర్భంగా కోరాలని సూచించారు. ఇక్కడి ప్రజాప్రతినిధుల లేఖలకు టీటీడీ ప్రాధాన్యం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఏపీ సీఎంకు విజ్ఞప్తి చేయాలన్నారు. ఈరోజు సాయంత్రం చంద్రబాబు, రేవంత్ రెడ్డి ప్రజాభవన్‌లో భేటీ కానున్నారు.

# బ్రిటన్ నూతన ప్రధాని కీర్ స్టార్మర్ కు శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోదీ

- బ్రిటన్ ఎన్నికల్లో లేబర్ పార్టీ ఘనవిజయం
- ప్రధాని పదవికి రిషి సునాక్ రాజీనామా
- ప్రధాని పీఠం ఎక్కబోతున్న కీర్ స్టార్మర్



**హైదరాబాద్ పెన్ పవర్:** బ్రిటన్ ఎన్నికల్లో కీర్ స్టార్మర్ నాయకత్వంలోని లేబర్ పార్టీ 412 స్థానాలతో ఘనవిజయం సాధించడం తెలిసిందే. రిషి సునాక్ సారథ్యంలోని కన్జర్వేటివ్ పార్టీ కేవలం 121 స్థానాలకే పరిమితమైంది. ప్రధాని పదవికి రిషి సునాక్ రాజీనామా చేయగా... బ్రిటన్ నూతన ప్రధానిగా కీర్ స్టార్మర్ పగ్గాలు అందుకోనున్నారు. ఈ నేపథ్యంలో, భారత ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. బ్రిటన్ నూతన ప్రధాని కాబోతున్న కీర్ స్టార్మర్ తో మాట్లాడడం ఎంతో సంతోషం కలిగించిందని వెల్లడించారు. ప్రధానమంత్రి పీఠం ఎక్కుతున్న కీర్ స్టార్మర్ కు శుభాకాంక్షలు తెలిపానని వివరించారు. ఇరుదేశాల సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం, ఇరుదేశాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి, ప్రపంచ హితం దిశగా దృఢమైన ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి తాము కట్టుబడి ఉంటామని మోదీ ట్వీట్ చేశారు.

# తెలుగు ఫ్యాన్స్ అభిమానం.. ధోనీ బర్త్‌డేకు 100 అడుగుల కటౌట్..!

**నేడు ధోనీ 43వ పుట్టినరోజు**

**దేశవ్యాప్తంగా బర్త్‌డే వేడుకలకు సిద్ధమవుతున్న ఫ్యాన్స్**

**మహీపై తమ అభిమానం చాటుకున్న తెలుగు అభిమానులు**






**హైదరాబాద్ పెన్ పవర్:** భారత మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీది నేడు (ఆదివారం) 43వ పుట్టినరోజు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా మహీ పుట్టినరోజు వేడుకలు గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసేందుకు అభిమానులు సిద్ధమవుతున్నారు. అందుకు సంబంధించి భారీ ఎత్తున ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలో ధోనీపై తెలుగు ఫ్యాన్స్ తమ అభిమానం చాటుకున్నారు. ఒకటికాదు రెండుకాదు ఏకంగా 100 అడుగుల ఎంఎస్‌డీ కటౌట్‌ను అభిమానులు ఏర్పాటు చేశారు. కాగా, ఈ భారీ కటౌట్ కృష్ణా జిల్లా నందిగామ మండలం అంబారుపేట సమీపంలోని హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. దీని తాలూకు ఫొటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతున్నాయి. ఇది చూసిన అభిమానులు ధోనీకి అడ్వాన్స్ హ్యాపీ బర్త్ డే చెబుతూ కామెంట్లు చేస్తున్నారు.

ఇక మహేంద్రుడి సారథ్యంలో భారత్ 2007లో టీ20 వరల్డ్‌కప్, 2011లో వన్డే ప్రపంచకప్, 2013లో ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచిన విషయం తెలిసిందే. అలాగే టీమిండియాకు టెస్టుల్లో నం.01 ర్యాంక్ కూడా అందించాడు ధోనీ.

**ధోనీ అంతర్జాతీయ క్రికెట్ కెరీర్ ఇలా..**

90 టెస్టులు, 350 వన్డేలు, 98 టీ20 మ్యాచ్‌లు ఆడిన ధోనీ ప్రతి ఫార్మాట్‌లోనూ తన ప్రతిభను నిరూపించుకున్నాడు. టెస్టుల్లో 4,876 పరుగులు, వన్డేల్లో 10,773, టీ20ల్లో 1,617 పరుగులు చేశాడు. అటు కీపర్‌గాను రాణించి ఎన్నో రికార్డులు కొల్లగొట్టాడు. మొత్తానికి ధోనీ ఓ అద్భుతమైన క్రికెటర్‌గా నిలిచాడు.

**ఐపీఎల్‌లోనూ మహీ మార్క్..**

264 ఐపీఎల్ మ్యాచ్‌ల్లో 5,243 పరుగులు చేసిన ధోనీ, ఐపీఎల్ చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన వికెట్ కీపర్-బ్యాట్స్‌మెన్‌గా కొనసాగుతున్నాడు. ఈ ఏడాది ఐపీఎల్‌తో ఎంఎస్‌డీ రిటైర్ అవుతారని కథనాలు వెలువడినప్పటికీ దీనిపై ధోనీ స్పందించలేదు. సో.. వచ్చే ఏడాది ఐపీఎల్‌లో ధోనీ బరిలోకి దిగినా ఆశ్చర్యపోనక్కర్లేదు.

# ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైఖేల్ వాన్ వ్యాఖ్యలకు రవిశాస్త్రి కౌంటర్

**టీ20 వరల్డ్ కప్ నెగ్గిన టీమిండియా**

**వరల్డ్ కప్ నిర్వాహకులు భారత్ కు అనుకూలంగా వ్యవహరించారన్న మైఖేల్ వాన్**

**వాన్ ఇష్టం వచ్చినట్టు మాట్లాడతాడన్న రవిశాస్త్రి**

**వాన్ ఒక్కసారి కూడా వరల్డ్ కప్ నెగ్గలేదని ఎద్దేవా**

**భారత్ నాలుగు సార్లు ట్రోఫీలు గెలిచిందని వెల్లడి**



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైఖేల్ వాన్ భారత్ అంటే విషం వెళ్లగక్కుతుంటాడన్న సంగతి తెలిసిందే. సందర్భం వచ్చినప్పుడల్లా టీమిండియాపై అవాకులు చెవాకులు పేలుతుంటాడు.

తాజాగా, టీమిండియా టీ20 వరల్డ్ కప్ కైవసం చేసుకున్న నేపథ్యంలోనూ, మైఖేల్ వాన్ అక్కసు వెళ్లగక్కాడు. టోర్నీ నిర్వాహకులు భారత్ కు అనుకూలంగా వ్యవహరించారని ఆరోపించాడు. వాన్ వ్యాఖ్యలపై భారత క్రికెట్ దిగ్గజం రవిశాస్త్రి స్పందించాడు. మైఖేల్ వాన్ నోటికి అడ్డు అదుపు ఉండదని, అతడి మాటలను భారత్ లో ఎవరూ పట్టించుకోరని పేర్కొన్నాడు. భారత్ పై వ్యాఖ్యలు చేసే బదులు... వరల్డ్ కప్ లో ఇంగ్లండ్ జట్టు సెమీస్ లో ఎందుకు ఓడిపోయిందన్న దానిపై అతడు దృష్టి పెడితే మంచిదని రవిశాస్త్రి చురక అంటించాడు.

భారత్ ఇప్పటిదాకా నాలుగు ఐసీసీ ట్రోఫీలు సాధించిందని, ఇంగ్లండ్ రెండు పర్యాయాలు మాత్రమే ట్రోఫీ అందుకుందని తెలిపాడు. కానీ మైఖేల్ వాన్ ఒక్కసారి కూడా వరల్డ్ కప్ నెగ్గలేదని రవిశాస్త్రి ఎద్దేవా చేశాడు.

# జింబాబ్వేతో తొలి టీ20... టాస్ గెలిచిన టీమిండియా

**జింబాబ్వేలో టీమిండియా పర్యటన**

**ఇరు జట్ల మధ్య ఐదు టీ20ల సిరీస్**

**హరారేలో నేడు తొలి మ్యాచ్**

**టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న టీమిండియా**




**హైదరాబాద్ పెన్ పవర్:** శుభ్ మాన్ గిల్ సారథ్యంలోని యువ టీమిండియా జట్టు జింబాబ్వేతో ఐదు మ్యాచ్ ల టీ20 సిరీస్ ఆడనుంది. నేడు ఇరు జట్ల మధ్య తొలి టీ20 మ్యాచ్ జరగనుంది. హరారేలోని స్పోర్ట్స్ క్లబ్ స్టేడియం ఈ మ్యాచ్ కు వేదిక. టాస్ గెలిచిన టీమిండియా బౌలింగ్ ఎంచుకుంది. ఈ మ్యాచ్ ద్వారా అభిషేక్ శర్మ, రియాన్ పరాగ్ టీమిండియా తరఫున అంతర్జాతీయ అరంగేట్రం చేస్తున్నారు. ధ్రువ్ జురెల్ కూడా టీ20ల్లో అరంగేట్రం చేస్తున్నాడు. మరోవైపు కొందరు సీనియర్ ఆటగాళ్లు లేకుండానే జింబాబ్వే బరిలో దిగుతోంది. ఈ జట్టుకు సీనియర్ ఆల్ రౌండర్ సికిందర్ రజా కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు.

## తమన్నా అందమైన చీర చిత్రాలు



# జాదూగాళ్ సోనారిక సిమసిమలు



**హైదరాబాద్ పెన్ పవర్:** జాదుగాడు చిత్రంతో తెరకు పరిచయమైంది ఉత్తరాది బ్యూటీ సోనారిక బదోరియా. నాగశౌర్య సరసన నటించిన ఈ బ్యూటీ ఆరంభం గ్లామర్ షోకి వెనకాడలేదు. బెల్లంకొండ %--%స్పీడున్నోడు%--%లోనూ సోనారికా నటించింది. %--%ఈడోరకం ఆడోరకం%--%తో మంచు కాంపౌండ్ లో అడుగుపెట్టింది. ఆ తర్వాత బాలీవుడ్ లో సాన్ సీన్ అనే చిత్రంలో నటించింది. ఇంద్రజిత్ అనే తమిళ చిత్రంలోనూ నాయికగా నటించింది. కానీ సౌత్ లో ఈ బ్యూటీకి సరైన లక్ చిక్కలేదు. అవసరమైన విజయం దక్కలేదు. చివరికి టీవీ సీరియళ్లతో బిజీ అయింది. హిందీలో హరహర మహదేవ్ సీరియల్ తో సోనారిక నటిగా మంచి పేరు తెచ్చుకుంది. ఇటీవల సెకండ్ ఇన్నింగ్స్ లో దూకుడు పెంచిన సోనారిక హాటెస్ట్ ఫోటోషూట్లతో విరుచుకుపడుతోంది. ప్రస్తుతం ఓటీటీలోను ఈ భామ అవకాశాల కోసం ప్రయత్నిస్తోంది. మధ్యతరగతి నుండి వచ్చిన ఈ బ్యూటీ ఒకటిన్నర దశాబ్ధాల పాటు ప్రయత్నాలను కొనసాగించింది. వెబ్ సిరీస్ లు, సినిమాల జోన్‌లోకి ప్రవేశించడానికి టీవీ నుండి విరామం తీసుకున్న ఈ బ్యూటీ ఇటీవల పలువురు దర్శకనిర్మాతలతోను మంతనాలు సాగిస్తున్నానని తెలిపింది. మరోవైపు సోనారిక సోనారిక సోషల్ మీడియాల్లోను స్పెషల్ ఫోటోషూట్లతో విరుచుకుపడుతోంది. తాజాగా బికినీలో నదిలో స్నానానికి వెళుతున్న ఫోటోలు అంతర్జాలంలో వైరల్ అయ్యాయి. అక్కడ సూర్యాస్తమయం వేళ సోనారిక నీటిలో జలకాలాటలకు వెళుతోంది. ఈ అందమైన ఫోటోలు ఇప్పుడు అంతర్జాలంలో వైరల్ గా మారుతున్నాయి. ఇతర విషయాలు టచ్ చేస్తే... సోనారిక స్లైస్-ఆఫ్-లైఫ్ సిరీస్ - నో కిడ్డింగ్ - లో నటించిన సోనారిక కరణ్ (రజ్దాన్) సర్ చిత్రం హిందుత్వ చిత్రంలోను నటించింది. లక్నో బ్యూటీ సోనారికకు బిజినెస్ మేన్ వికాష్ పరషార్ తో ఇంతకుముందు నిశ్చితార్థమైంది. ఈ జంట ఫోటోలు కూడా అంతర్జాలంలో వైరల్ అయ్యాయి. అయితే పెళ్లి గురించిన ఎలాంటి అప్ డేట్ లేదు.

## కృతి సనన్ షో-స్టాపింగ్ గ్రీన్ డ్రెస్



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com